


క్షయ నియంత్రణ విభాగంలో పోస్టుల భర్తీకి రీ నోటిఫికేషన్

ప్రజాశక్తి - విజయనగరం

పార్వతీపురం మన్యం జిల్లా క్షయ విభాగంలో ఐదు పోస్టులను భర్తీ చేసేందుకు రీ నోటిఫికేషన్ విడుదల చేసినట్లు విజయనగరం జిల్లా లెప్రసీ, ఎయిడ్స్, క్షయ నియంత్రణ అధికారి డా.కె.రాణి ఒక ప్రకటనలో వెల్లడించారు. వైద్యాధికారి, జిల్లా ప్రోగ్రాం కోఆర్డినేటర్, డాట్స్ ప్లస్ టిబి-హెచ్ఐవి సూపర్‌వైజర్, పిపిఎం కోఆర్డినేటర్, అకౌంటెంట్ ఉద్యోగాల్లో కాంట్రాక్టు పద్ధతిలో అభ్యర్థుల నియామకానికి దరఖాస్తులను ఆహ్వానిస్తున్నట్టు పేర్కొన్నారు. అభ్యర్థులు తమ దరఖాస్తులను ఆగష్టులోగా విజయనగరంలోని జిల్లా వైద్య, ఆరోగ్య అధికారి కార్యాలయ ఆవరణలో గల జిల్లా లెప్రసీ, ఎయిడ్స్, క్షయ నియంత్రణ అధికారి కార్యాలయంలో అందజేయాలని కోరారు. ఇతర సమాచారం కోసం జిల్లా వెబ్‌సైట్ www.vizianagaram.nic.in పరిశీలించవచ్చని తెలిపారు.



ఐటిడిఎ పిఒగా బాధ్యతలు స్వీకరిస్తున్న రాహుల్‌కుమార్‌రెడ్డి

విద్య, వైద్య రంగాలపై ప్రత్యేక దృష్టి

జీవనోపాధులు పెంపొందించేందుకు కృషి
ఐటిడిఎ నూతన పిఒ రాహుల్ కుమార్ రెడ్డి

ప్రజాశక్తి-సీతంపేట

విద్య వైద్య రంగాలపై ప్రత్యేక దృష్టి పెడుతున్నట్లు ఐటిడిఎ పిఒ టి.రాహుల్ కుమార్ రెడ్డి తెలిపారు. శుక్రవారం సీతంపేట నూతన ఐటిడిఎ పిఒగా బాధ్యతలు స్వీకరించారు. ఈ సందర్భంగా ఆయన విలేకరులతో మాట్లాడుతూ మన్యంలో మలేరియా కేసులు అధికంగా ఉన్నాయని, అవసరమైతే వైద్య శిబిరాలు నిర్వహిస్తామని అన్నారు. డ్రై డే ఫ్రైడే పారిశుధ్య కార్యక్రమాలు. పరిసరాలు పరిశుభ్రత కార్యక్రమాలు నిర్వహించి మలేరియా నివారణకు చర్యలు చేపడతామన్నారు. డిప్యూటీ డిఎంహెచ్ఒ పోస్టుల భర్తీకి కలెక్టర్ దృష్టికి తీసుకెళ్తామన్నారు. మలేరియా డెంగీ వంటి వ్యాధుల నివారణకు చర్యలు చేపడతామన్నారు. విద్యార్థులకు క్వాలిటీ ఎడ్యుకేషన్ అందిస్తామన్నారు. కేంద్ర ప్రభుత్వం అందించిన వన్ దన్ వికాస కేంద్రాలను పర్యవేక్షణ చేస్తామని తెలిపారు. ఏజెన్సీలో వనరులు ఉపయోగించి జీవనోపాధులు పెంపొందించేందుకు కృషి చేస్తామన్నారు. గతంలో ఉమ్మడి శ్రీకాకుళం జిల్లా టెక్కలి సబ్ కలెక్టర్‌గా పని చేశామని, ఈ ప్రాంతంపై అవగాహన ఉందన్నారు. ప్రజా సమస్యల పరిష్కార వేదికలో ఏ మండలంలో అధికంగా వినతులు వస్తే ఆ మండలంలో గ్రీవెన్స్ మండల స్థాయిలో నిర్వహిస్తామని తెలిపారు. రోడ్డు ప్రమాదాలు నివారణకు హెల్మెట్ వాడేలా అవగాహన కల్పిస్తామన్నారు.

కలెక్టర్‌ను కలిసిన పిఒ

పార్వతీపురం రూరల్ : సీతంపేట కొత్త ఐటిడిఎ ప్రాజెక్ట్ అధికారిగా టి.రాహుల్ కుమార్ రెడ్డి శుక్రవారం బాధ్యతలు స్వీకరించిన అనంతరం జిల్లా కలెక్టర్ ఎ.శ్యామ్ ప్రసాద్‌ను మర్యాద పూర్వకంగా కలిసి పుష్ప గుచ్ఛాన్ని అందజేశారు. ఈ సందర్భంగా ప్రాజెక్ట్ పరిధిలో గిరిజనాభివృద్ధికి కృషి చేయాలని కలెక్టర్ సూచించారు.

జగనన్న కాలనీలు... సమస్యలకు నిలయాలు

చెరువులను తలపించేలా రోడ్లు
కానరాని మౌలిక సదుపాయాలు

ప్రజాశక్తి - సాలూరు

జిల్లాలోని పలు గ్రామాల్లో గల జగనన్న కాలనీలు సమస్యలకు నిలయాలుగా మారాయి. సరైన రోడ్డు సౌకర్యం లేకపోవడంలో కాలనీల్లో ఇళ్లు నిర్మించుకొనేందుకు లబ్ధిదారులు తీవ్ర ఇబ్బందులు పడుతున్నారు. అలాగే విద్యుత్, కాలువ, రోడ్లు తదితర మౌలిక సదుపాయాలు లేకపోవడం లబ్ధిదారులు నిర్మాణాలకు ముందుకు రావడంలేదు. దీంతో పనులు నత్తనడకన సాగుతున్నాయి.

పట్టణానికి చెందిన నెలిపర్తి జగనన్న కాలనీలో వర్షాలకు రహదారులు చెరువులను తలపించేలా ఉన్నాయి. పక్కా రహదారుల నిర్మాణం జరగకపోవడంతో లబ్ధిదారులు నానా అవస్థలు పడుతున్నారు. గత కొద్ది రోజులుగా కురుస్తున్న వర్షాలకు కాలనీలో రహదారులు చిందరవందరగా వున్నాయి. కొంతమంది ఇళ్ల నిర్మాణం పూర్తి చేసినా గృహ ప్రవేశం చేయలేని స్థితిలో ఉన్నారు. అసంపూర్తిగా వున్న లబ్ధిదారులు నిర్మాణ సామగ్రి రవాణా చేసుకోవడానికి అనువైన పరిస్థితులు లేక ఎక్కడ వేసిన గొంగళి అక్కడే అన్న చందంగా వదిలేశారు. ఈ కాలనీలో రహదారుల నిర్మాణానికి గత ప్రభుత్వం నిధులు



పాచిపెంట లో జగనన్నకాలనీకి వెళ్లే అధ్వాన రోడ్డు

మంజూరు చేసింది. కాంట్రాక్టరు టెండర్ దక్కించుకున్నా పనులు ప్రారంభించలేదు. బిల్లులు మంజూరు కావడం లేదన్న భయంతో కాంట్రాక్టరు ఇంటర్నల్ రహదారులు నిర్మించలేదు. దీంతో లబ్ధిదారులు తీవ్ర ఇబ్బందులు ఎదుర్కొంటున్నారు.

వీరఘట్టం : మండలంలో నిర్మిస్తున్న జగనన్న కాలనీలో రహదారులు, విద్యుత్తు సౌకర్యాలు లేవు. దీంతో లబ్ధిదారులు పనులు చేపట్టుకునేందుకు వీలు ఉండడంలేదు. మండలంలోని 17 లేఅవుట్లలో ఇంతవరకు 795 ఇళ్ల పనులు జరిగినట్టు అధికారులు చెబుతున్నారు. చలివేంద్రి, వీరఘట్టం ఇంకా ఇళ్ల నిర్మాణాలు ప్రారంభించలేదు.

పార్వతీపురం రూరల్ : పార్వతీపురం పట్టణంలోని ఇళ్లు లేని పేదలకు మండలంలోని కారాడవలస, గోపాలపురం, పెదబొండపల్లిలో భూములు సేకరించి లేఔట్లు వేసి ఇళ్ల నిర్మాణాలకు పట్టాలు మంజూరు చేశారు. అయితే మౌలిక సదుపాయాలు కల్పించడంలో అధికారులు ఘోరంగా విఫలమవ్వడంతో లబ్ధిదారులు ఇళ్ల నిర్మాణాలకు ఇబ్బందులు పడుతున్నారు. పట్టణంలో ఉన్న తమకు దూరంలో ఉన్న పల్లె ప్రాంతాల్లో ఇళ్ల స్థలాలు మంజూరు చేయడమే కాకుండా మౌలిక సదుపాయాలు కల్పనలో కూడా నిర్లక్ష్యం వహించారు. ఈ వర్షాకాలం కాలనీలకు చేరుకోవాలంటే సరైన రోడ్డు సౌకర్యం లేక మోకాలి లోతు బురదలో దిగి వెళ్లాల్సి వస్తుందని లబ్ధిదారులు వాపోతున్నారు. హౌసింగ్ అధికారుల ఒత్తిడితో ఇళ్ల నిర్మాణాలు చేపట్టిన లబ్ధిదారులు తీవ్ర అసంతృప్తి వ్యక్తం చేస్తున్నారు. తమ లక్ష్యాలు పూర్తికి లబ్ధిదారులపై ఒత్తిడి తెచ్చిన అధికారులు కనీస అవసరాలైన రహదారులు, కాలువలు నిర్మించకపోవడం పట్ల ఆగ్రహం వ్యక్తం చేస్తున్నారు.

పాచిపెంట : పాచిపెంట గ్రామ శివారులో గత ప్రభుత్వం జగనన్న కాలనీల నిర్మాణంలో భాగంగా గ్రామానికి చెందిన 183 మంది లబ్ధిదార్లకు ఇళ్ల స్థలాలు



పార్వతీపురం : కారాడవలసలో జగనన్నకాలనీకి వెళ్లే రోడ్డు

మంజూరు చేశారు. 88 మంది పూర్తిగా ఇళ్ల నిర్మాణాలు చేపట్టారు. మిగతావి వివిధ దశల్లో నిర్మాణాల్లో ఉన్నాయి. మౌలిక సదుపాయాల్లేక కాలనీలో నివసించేందుకు లబ్ధిదారులు ముందుకు రావడం లేదు. గత వారం రోజులుగా కురుస్తున్న వర్షాలకు రోడ్లు లేక లబ్ధిదారులు అనేక ఇబ్బందులు ఎదుర్కొంటున్నారు. కాలనీలో పక్కా రోడ్లు, కాలువలు నిర్మించాలని లబ్ధిదారులు కోరుతున్నారు.



సాలూరు : నెల్లిపర్తిలో జగనన్నకాలనీ దుస్థితి



గ్రంథాలయాన్ని ప్రారంభిస్తున్న కలెక్టర్ శ్యామ్ ప్రసాద్

జిల్లాలో విజ్ఞాన వికాస కేంద్రాలు

ప్రజాశక్తి - పార్వతీపురం టౌన్

జిల్లాలో ఎంపిక చేసిన గ్రామాల్లో గ్రామ విజ్ఞాన వికాస కేంద్రాలు ఏర్పాటు చేయనున్నట్టు కలెక్టర్ ఎ.శ్యామ్ ప్రసాద్ తెలిపారు. పట్టణంలోని బెలగాంలో గల చర్చి వీధిలో పట్టణ విజ్ఞాన వికాస కేంద్రాన్ని శుక్రవారం ప్రారంభించారు. రాష్ట్ర, కేంద్ర ప్రభుత్వాలు, ప్రభుత్వ రంగ విభాగాలు, ఇతర సంస్థల ద్వారా నిర్వహించే వివిధ పోటీ పరీక్షలకు పుస్తకాలను అందించడమే ఈ కేంద్రాల లక్ష్యమన్నారు. ఈ కేంద్రాల్లో ఇంటర్నెట్, ఉద్యోగ నోటిఫికేషన్లు, దరఖాస్తు కోసం ఆన్‌లైన్ ప్రక్రియ, మెటీరియల్ డౌన్‌లోడ్ చేయడం, పోటీ పరీక్షల మ్యాగజైన్‌లు, దినపత్రికలు మొదలైన సౌకర్యాలు కల్పిస్తామన్నారు. వికాస కేంద్రాలు ఉదయం 8 నుండి రాత్రి 8 గంటల వరకు తెరిచి ఉంటాయన్నారు. ఉద్యోగార్థుల కోసం జిల్లా యంత్రాంగం అన్ని విధాలా సహాయ సహకారాలు అందిస్తుందని తెలిపారు. అభ్యర్థులు కేంద్రాలను సొంత కేంద్రాలుగా పరిగణించాలని సూచించారు. వీటిని మరింత మెరుగ్గా నడిపేందుకు ఒక కమిటీని ఏర్పాటు చేసుకోవాలని వినియోగదారులకు విజ్ఞప్తి చేశారు. కేంద్రాలను ఉదయం 8 గంటలకు తెరవడం నుంచి అన్ని సౌకర్యాలు పర్యవేక్షించాలని కోరారు. కేంద్రంలో సౌకర్యాలు కల్పించేందుకు స్పాన్సర్లు ముందుకు రావాలని కోరారు. కార్యక్రమంలో మున్సిపల్ చైర్‌పర్సన్ బోను గౌరీశ్వరి, కమిషనర్ కె.శ్రీనివాస్, జిఎస్‌డబ్ల్యుఎస్ జిల్లా నోడల్ అధికారి కె.రామచంద్రరావు తదితరులు పాల్గొన్నారు.

కొమరాడ : గ్రామాల్లో ప్రభుత్వం ఏర్పాటు చేస్తున్న గ్రామ విజ్ఞాన్ వికాస కేంద్రాలను యువత సద్వినియోగం చేసుకోవాలని ఎంపిడిఒ ఎం.మల్లికార్జునరావు అన్నారు. మండలంలోని కొమరాడ, విక్రాంపురం, ఆర్తాంలో శుక్రవారం విజ్ఞాన వికాస కేంద్రాలను ప్రారంభించారు. కార్యక్రమంలో ఇఒపిఆర్‌డి రాధాకృష్ణ, మండల కార్యాలయ ఎఒ రమేష్, పంచాయతీ కార్యదర్శి, సచివాలయ సిబ్బంది ఉన్నారు.

మురికికూపంలా మురగడం

ఈ రోడ్డును చూస్తే పొలానికి వెళ్లే మార్గమని అనుకుంటే మీరు పొరబడినట్టే. ఇదే ఓ గ్రామానికి వెళ్లే ప్రధాన రహదారి. ఇంత అధ్వానంగా గ్రామ ప్రధాన రహదారి ఉంటే ఆ గ్రామ అధికారులు, పాలకులకు పట్టకపోవడం చూసే వారికి విస్మయం కలగక మానదు. పరిసరాలను పరిశుభ్రంగా ఉంచుకోవాలని, మురుగునీరు, కాలువుల్లో పూడికలు తీసి ప్రజలు వ్యాధుల బారినపడకుండా ఉండేందుకు జిల్లా వ్యాప్తంగా అధికారులు ఎంతో అట్టహాసం నిర్వహిస్తున్న పారిశుధ్యపక్షోత్సవాలు పేపర్లలో ఫొటోలకే పరిమితమని సర్వత్రా విమర్శలు వెల్లువెత్తుతున్నారు. ఎక్కడికక్కడ గ్రామాల్లో బురదమయమైన రోడ్లు దర్శనమిస్తుండడంతో అధికారులు చేతలకు వాస్తవ పరిస్థితి ఎక్కడా పొంతన లేదన్నందుకు ఈ రోడ్డే నిదర్శనం.

- కలెక్టర్ ఆదేశాలు బేఖాతారు
- మడులను తలపిస్తున్న ప్రధాన రహదారి
- కానరాని పారిశుధ్య పక్షోత్సవాలు

ప్రజాశక్తి - బలిజిపేట

మండలంలోని మురగడం గ్రామానికి మధ్య ఒకే ఒక రహదారి ఉంది. ఇది పూర్తిగా బురద మయంగా మారి పొలం మడులను తలపించేలా ఉంది. ఊరి మొదలు చివరి వరకు పూర్తిగా బురదమయం కావడంతో ఈ రోడ్డుపై రాకపోకలు సాగించేందుకు స్థానికులు భయాందోళన చెందుతున్నారు. 'బాబు పుణ్యం కట్టుకోండి... ఈ రోడ్డును బాగు చేయండి... మాకు ఈ నరకం నుంచి విముక్తి కలిగించండంటూ' అని ఆ గ్రామానికి వచ్చిన ప్రతి అధికారికీ తమ ఆవేదనను వెళ్లబుచ్చుకుంటున్నారు. అయినా ఎవరూ పట్టించుకున్న పాపాన లేదు.



కాలువలో పేరుకుపోయిన మురుగునీరు



మురుడం గ్రామ ప్రధాన రహదారి

జిల్లాకు కొత్తగా వచ్చిన కలెక్టర్ శ్యామ్ ప్రసాద్ ఈనెల 18న బర్లిలో పారిశుధ్య వారోత్సవాల్లో పాల్గొని పారిశుధ్యం నిర్వహణలో నిర్లక్ష్యం వహిస్తే చర్యలు తప్పవని హెచ్చరించినా, వీరు పనితీరు మాత్రం ఏమాత్రం మారకపోవడం గమనార్హం. కలెక్టర్ ఆదేశాలను సైతం బేఖాతారు చేసి నిర్లక్ష్యంగా విధులు నిర్వహిస్తున్న అధికారులపై చర్యలు తీసుకోవాలని గ్రామస్తులు కోరారు. గ్రామం మధ్య ఇంత మురికి ఉన్నా, ఎక్కడికక్కడ చెత్తాచెదారం పేరుకుపోయినా సంబంధిత అధికారులు, స్థానిక నాయకులు పట్టించుకోకపోవడం బాధాకరమని గ్రామస్తులు ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. మడుల్లో ఉడుపుకి సిద్ధంగా ఉన్న నాటు ఆకుల్ని తీసుకొచ్చి గ్రామం మధ్యలో ఉడుస్తూ నిరసన తెలుపుతామన్నారు. ఇలా మురుగునీరు, చెత్త పేరుకుపోవడం వల్ల విష జ్వరాలు వచ్చే అవకాశం ఎక్కువగా ఉందని, సీజన్ కూడా జ్వరాల వ్యాప్తికి సహకరిస్తుందని గ్రామస్తులు భయాందోళన వ్యక్తం చేస్తున్నారు. పేపర్లో ఫొటోలకు పరిమితం కాకుండా చిత్తశుద్ధితో పారిశుధ్యం మెరుగునకు కృషి చేస్తే వ్యాధుల అదుపునకు దోహదం చేస్తుంది. ఇప్పటికైనా అధికారులు స్పందించి తమ గ్రామంలో పారిశుధ్య మెరుగునకు చర్యలు తీసుకోవాలని గ్రామస్తులు కోరుతున్నారు.

జిల్లాలో హెల్త్ ఎమర్జెన్సీ ప్రకటించాలి

- మరణించిన గిరిజన విద్యార్థి కుటుంబానికి రూ.25 లక్షలు ఎక్స్‌గ్రేషియా ఇవ్వాలి
- ప్రజాసంఘాల డిమాండ్
- మృతుడి కుటుంబానికి పరామర్శ

ప్రజాశక్తి - మక్కువ

జిల్లాలో వ్యాధుల బారినపడి విద్యార్థులు మృత్యువాతపడుతున్నారని, వెంటనే జిల్లాలో హెల్త్ ఎమర్జెన్సీ ప్రకటించాలని ప్రజాసంఘాల నాయకులు డిమాండ్ చేశారు. ఈనెల 21న రాఘవ అనే గిరిజన విద్యార్థి మలేరియా బారిన పడి మృతి చెందారు. దీంతో రాఘవ స్వగ్రామమైన దుగ్గేరు వెళ్లి ఆయన కుటుంబసభ్యులను ఆదివాసీ గిరిజన సంఘం, ఎపి వ్యవసాయ కార్మిక సంఘం నాయకులు తాడంగి ప్రభాకర్, కొల్లి గంగునాయుడు పరామర్శించారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ పంచాది రాఘవతో పాటు గుమ్మలక్ష్మీ పురం మండలం వంగరలో గౌతమ్, కురుపాం మండలం తిత్తిరి పంచాయతీ కీడవాయిలో పృథ్వీ ఇలా విద్యార్థులు మలేరియా బారినపడి మరణిస్తున్నారని ఆందోళన వ్యక్తంచేశారు. దీనికి ప్రభుత్వమే బాధ్యత వహించాలన్నారు. అలాగే గతంలో ప్రైవేటు వైద్యం వికటించి మరణించిన సందర్భాలున్నాయని, అనేకమంది గిరిజనులు గ్రామాల్లో చనిపోతున్నా బయటకు రాకుండా ఉన్నవి ఎన్నో ఉన్నాయని అన్నారు. ఇవన్నీ వైద్య సదుపాయాల సక్రమంగా అందకపోవడం వల్ల సంభవించే మరణాలని అన్నారు. మలేరియా జ్వరంతో ప్రభుత్వాసుపత్రికి వెళ్తే రక్తపరీక్షలో పాజిటివ్ వచ్చినా, నెగిటివ్ చూపిస్తున్నారని గిరిజనులు చెబుతున్నారని తెలిపారు. దీంతో గత్యంతరం లేక ప్రైవేట్ హాస్పిటళ్లను ఆశ్రయించాల్సి వస్తోందని దుగ్గేరుకు చెందిన పలువురు గిరిజనులు చెప్పారు. కావున దీన్ని వెంటనే డిఎంహెచ్ఒ పరిగణలోకి తీసుకొని మలేరియా కేసులను సమగ్రంగా పరిశీలించి వెంటనే పూర్తిస్థాయిలో వైద్య సదుపాయాలు అందించాలని డిమాండ్ చేశారు, వసతిగృహాల్లో ఎఎన్‌ఎంలను వెంటనే నియమించాలని డిమాండ్ చేశారు. అన్ని



విద్యార్థి కుటుంబసభ్యులతో మాట్లాడుతున్న ప్రజాసంఘాల నాయకులు

గ్రామాల్లో ముందస్తు వైద్య శిబిరాలు ఏర్పాటు చేయాలని, అవసరమైతే విజయనగరం, విశాఖ పట్టణాల నుంచి వైద్య నిపుణులను మన్యం జిల్లాకు తీసుకొచ్చి వైద్యం చేయాలని డిమాండ్ చేశారు. గిరిజన ప్రాంతాల్లో గిరిజనులకు అందుబాటులో పిహెచ్‌సిలు ఏర్పాటు చేయాలని కోరారు. డిమాండ్ చేశారు ఈ సమస్యలన్నింటిపై జిల్లా వ్యాప్తంగా ప్రజాసంఘాల నాయకులు జిల్లా వైద్య అధికారిని దృష్టికి తీసుకెళ్లనున్నట్టు తెలిపారు. అప్పటికీ సమస్యలు పరిష్కారం కాకపోతే గిరిజనులందర్నీ కదిలించి పోరాటం చేస్తామని హెచ్చరించారు. అలాగే మరణించిన విద్యార్థి పంచాది రాఘవ కుటుంబానికి రూ.25 లక్షల నష్టపరిహారం ప్రభుత్వం ఇవ్వాలని డిమాండ్ చేశారు. కార్యక్రమంలో గిరిజన సంఘ నాయకులు సొండి గౌరమ్మ, మండల లక్ష్మణరావు పాల్గొన్నారు.

నేడు కౌన్సిల్ సాధారణ సమావేశం

పార్వతీపురం టౌన్ : స్థానిక మున్సిపల్ కౌన్సిల్ సమావేశం శనివారం జరుగుతుందని కమిషనర్ కె.శ్రీనివాస్ ఒక ప్రకటనలో పేర్కొన్నారు. మున్సిపల్ చైర్ పర్సన్ బోను గౌరీశ్వరి అధ్యక్షతన ఈ సమావేశం జరుగుతుందని, కావున కౌన్సిలర్లు, వివిధశాఖ అధికారులు విధిగా హాజరు కావాలని కోరారు.

కిశోర బాలికలకు అవగాహన


వీరఘట్టం : మండలంలోని వండువ, బిటి వాడ జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాలల్లో శుక్రవారం కిశోర బాలికలకు సిడిపిఒ బి.సీమాలమ్మ అవగాహన కల్పించారు. ఆరోగ్య జాగ్రత్తలు, ఆహార నియమాలు, వివాహ నిబంధల గురించి వివరించారు. కార్యక్రమంలో సూపర్వైజర్ ఎన్.రాజేశ్వరి, ఉపాధ్యాయులు, అంగన్వాడీ కార్యకర్తలు, విద్యార్థులు, పాల్గొన్నారు.

గర్భిణుల వసతిగృహంలో సమస్యలు పరిష్కరించాలి

- రక్షిత తాగునీరు సరఫరా చేయాలి
- ఆదివాసీ గిరిజన సంఘం డిమాండ్

ప్రజాశక్తి - సాలూరు

పట్టణంలోని గుమడాం వైటిసిలో ఉన్న గిరి శిఖర గర్భిణుల వసతి గృహంలో సమస్యలు వెంటనే పరిష్కరించాలని ఆదివాసీ గిరిజన సంఘం నాయకులు డిమాండ్ చేశారు. శుక్రవారం వైటిసి గర్భిణుల వసతి గృహాన్ని ఆదివాసీ గిరిజన సంఘం జిల్లా గౌరవాధ్యక్షులు సీదరపు అప్పారావు ఆధ్వర్యాన ఆ సంఘం నాయకులు వంతల సుందర రావు, గెమ్మెల జానకీరావు, వ్యవసాయ కార్మిక సంఘం జిల్లా సహాయ కార్యదర్శి ఎం.శ్రీనివాసరావు పరిశీలించారు. గర్భిణీలతో మాట్లాడి సమస్యలను అడిగి తెలుసుకున్నారు. ఈ సందర్భంగా అప్పారావు మాట్లాడుతూ వసతి గృహం మురికి కూపంలో ఉందని, దీని నిర్వహణ, మెనూ సక్రమంగా అమలు చేయడం లేదని తెలిపారు. గర్భిణులు వాడుతున్న మరుగుదొడ్లలో నీరు నిల్వ వుండి మురికి కంపు కొడుతున్నాయని చెప్పారు. మలేరియా, డెంగీ వంటి జబ్బులు వచ్చే అవకాశాలు ఉన్నాయని



గర్భిణుల వసతిగృహంలో ఆర్‌ఒ ప్లాంట్‌ను పరిశీలిస్తున్న గిరిజనసంఘం నాయకులు

చెప్పారు. గర్భిణులకు సరైన పౌష్టికాహారం అందడం లేదని తెలిపారు. ఐటిడిఎ అధికారుల పర్యవేక్షణ లేకపోవడంతో సమస్యలు చాలా కాలంగా వెతుకుతూనే వున్నాయని చెప్పారు. వసతి గృహంలో నైట్ వాచ్ మాన్ కూడా లేరన్నారు. సమస్యలన్నీ పరిష్కారం చేయాలని డిమాండ్ చేశారు. గిరిజన గర్భిణులు రక్తహీనతతో బాధపడుతున్నారని, సరైన పౌష్టికాహారం అందించాలని కోరారు. గత ఏడాది కాలంగా వసతి గృహంలో ఉన్న ఆర్ఒ ప్లాంటు మరమ్మతుకు గురైనా బాగు చేయకపోవడం దారుణమని అన్నారు. వెంటనే వసతిగృహంలో గర్భిణులు ఎదుర్కొంటున్న సమస్యల్ని పరిష్కరించాలని, లేకపోతే ఆందోళన చేపడుతున్నామని అప్పారావు హెచ్చరించారు.

నాలుగో రోజుకు సిఆర్‌టిల దీక్షలు

ప్రజాశక్తి - పార్వతీపురం రూరల్

స్థానిక ఐటిడిఏ పరిధిలో గల సిఆర్‌టిలందర్నీ రెన్యువల్ చేయాలని కోరుతూ యుటిఎఫ్ ఆధ్వర్యంలో సిఆర్‌పిల సంఘం చేపట్టిన రిలే నిరాహార దీక్షలు నాలుగో రోజు శుక్రవారం కూడా కొనసాగించారు. ఈ సందర్భంగా యుటిఎఫ్ జిల్లా అధ్యక్ష, ప్రధాన కార్యదర్శులు టి.రమేష్, ఎస్.మురళీమోహనరావు మాట్లాడుతూ ప్రభుత్వం 206 మందికి రెన్యువల్ చేసుకొనేందుకు ఆర్థిక అనుమతితో పాటు ఉత్తర్వులు ఇచ్చినప్పటికీ స్థానిక ఐటిడిఎ అధికారులు 47మందికి రెన్యువల్ చేయకపోవడం దారుణమన్నారు. పదేళ్ల నుంచి ఎగైనెస్ట్ ఎస్‌జిటిలకు రెన్యువల్ చేశారని, గత ఏడాది కూడా ఈ అధికారులే రెన్యువల్ చేసినప్పటికీ ఈ ఏడాది ఇలాంటి ఇబ్బందులను గురిచేయడం అన్యాయమని అన్నారు. తమకు న్యాయం చేయాలని కోరుతూ సిఆర్‌టిలు గత నాలుగు రోజులుగా వర్షాలను సైతం లెక్కచేయకుండా నిరాహార దీక్షలు కొనసాగిస్తున్నప్పటికీ అధికారుల నుంచి కనీస స్పందన కరువైందని ఆవేదన వ్యక్తం చేశారు. తక్షణమే సిఆర్‌టిలను రెన్యువల్ చేయాలని, లేకుంటే ఈనెల 29న చలో ఐటిడిఎ కార్యక్రమాన్ని చేపడతామని హెచ్చరించారు. దీక్షలో పలువురు సిఆర్‌టిలు పాల్గొన్నారు.

ఘనంగా కార్గిల్ విజయ్ దివాస్

ప్రజాశక్తి - పార్వతీపురంరూరల్

దేశ రక్షణకు ప్రాణాలర్పించిన వీర సైనికుల త్యాగాలు మరువలేనివని కలెక్టర్ ఎ. శ్యామ్ ప్రసాద్ అన్నారు. భారతీయ యువమోర్చా, మాజీ సైనికుల ఆధ్వర్యంలో శుక్రవారం కలెక్టరేట్ ప్రాంగణంలో నిర్వహించిన విజయదివాస్ కార్యక్రమంలో కలెక్టర్ పాల్గొన్నారు. యుద్ధంలో మరణించిన సైనికుల చిత్రపటాలకు పూలమాలలువేసి నివాళులర్పించారు. శ్రద్ధాంజలి ఘటించారు. తొలుత కలెక్టరేట్ నుంచి ఆర్టీసీ కాంప్లెక్స్ వరకు నిర్వహించి ర్యాలీని జిల్లా కలెక్టర్ ప్రారంభించారు. కార్యక్రమంలో జిల్లా కలెక్టర్ మాట్లాడుతూ కార్గిల్ యుద్ధంలో మన సైన్యం సాధించిన విజయానికి గుర్తుగా విజయ్ దివాస్ జరుపుకుంటున్నట్లు తెలిపారు. దేశ రక్షణకు సైనికులు తమ ప్రాణాలు అర్పించారని, పాకిస్తాన్ దురాక్రమణను తిప్పికొట్టారన్నారు. మనమంతా సైనికుల త్యాగాలను మననం చేసుకోవాల్సిన అవసరం ఉందని, దేశ రక్షణ, అభివృద్ధికి యువత పాటుపడాలని తెలిపారు. కార్యక్రమంలో మాజీ సైనికులు, విద్యార్థిని విద్యార్థులు పాల్గొన్నారు.

వీరఘట్టం : స్థానిక శ్రీ గాయత్రి స్కూల్, కళాశాల



భామిని : మోడల్ స్కూల్‌లో కార్గిల్ విజయ్ దివాస్‌లో పాల్గొన్న విద్యార్థులు



సైనికులకు నివాళ్లు అర్పిస్తున్న కలెక్టర్ శ్యామ్‌ప్రసాద్

ఆధ్వర్యంలో కళాశాల నుండి ప్రధాన రహదారి గుండా అంబేద్కర్ జంక్షన్ వరకు కార్గిల్ దివాస్ విజయోత్సవ ర్యాలీ ఘనంగా నిర్వహించారు. ఈ సందర్భంగా ఎస్ఐ ఎస్.కె ఫక్రుద్దీన్, కళాశాల కరస్పాండెంట్ ఎస్ లోకేష్, ప్రిన్సిపల్ సింహాచలం కార్గిల్ దివస్ విజయోత్సవ గొప్పతనాన్ని వివరించారు. ఈ కార్యక్రమంలో సిబ్బంది, విద్యార్థులు, పాల్గొన్నారు.

గుమ్మలక్ష్మీపురం : కార్గిల్ విజయ్ దివస్ కార్యక్రమాన్ని స్థానిక డిగ్రీ కళాశాలలో నిర్వహించారు. ఈ సందర్భంగా ప్రిన్సిపల్ టి. శ్రీవరం కార్గిల్ పోరాటంలో సైనికుల సాహసాలను, విజయాలను, వారి త్యాగాలను వివరించారు. జాతీయ పతాకాన్ని గాల్లో ఎగరవేసి కార్గిల్ యుద్ధ విజయాన్ని చాటి చెప్పారు.

భామిని : స్థానిక ఆదర్శ పాఠశాలలో కార్గిల్ దివాస్ సందర్భంగా ఆదర్శ పాఠశాల విద్యార్థులు కొవ్వొత్తులతో ర్యాలీ నిర్వహించి, కార్గిల్ అమర వీరులకు నివాళ్లు అర్పించారు. ఈ సందర్భంగా పాఠశాల ప్రిన్సిపల్ రఘుపాత్రుని శివకుమార్, కార్గిల్ యుద్ధానికి గల కారణాలను పిల్లలకు వివరించారు. అనంతరం దేశభక్తిని పెంపొందించే సాంస్కృతిక కార్యక్రమాలు నిర్వహించారు. కార్యక్రమంలో పాఠశాల సిబ్బంది పాల్గొన్నారు.



అసెంబ్లీలో మాట్లాడుతున్న ఎమ్మెల్యే విజయచంద్ర

కేంద్రాస్పత్రిలో వైద్యులను నియమించాలి

అసెంబ్లీలో ఎమ్మెల్యే బోనెల విజయ్‌చంద్ర

ప్రజాశక్తి - పార్వతీపురంరూరల్

జిల్లా కేంద్ర ఆసుపత్రిలో వైద్యులను నియమించి వైద్య సౌకర్యాలు మెరుగుపర్చాలని స్థానిక ఎమ్మెల్యే ఎమ్మెల్యే బోనెల విజయ్ చంద్ర శాసనసభ లో ప్రశ్నోత్తరాల సమయంలో ప్రస్తావించారు. జిల్లా ఆవిర్భావం నుంచి ఈ ఆసుపత్రిలో వైద్యుల నిపుణులు, వ్యాక్సిన్ల కొరత ఉందని వివరించారు. దీంతో అనేకమంది గిరిజనులు, దళితులు 40 ఏళ్ల బతుకుతున్నారన్నారు. ఇందుకు అవగాహన లోపం, పూర్తిస్థాయిలో వైద్య సౌకర్యాలు లేకపోవడమేనని అన్నారు. మెరుగైన సౌకర్యాలులేకపోవడంతో అంబులెన్స్‌లో కెజిహెచ్‌కు తరలిస్తుండగా మార్గమధ్యలో మృతి చెందిన సంఘటనలు కూడా ఉన్నాయన్నారు. జిల్లా ఆస్పత్రి గా అప్‌గ్రేడ్ చేసినా పూర్తిస్థాయిలో సౌకర్యాల్లేవన్నారు. స్పెషలిస్టులు లేకపోవడంతో కెజిహెచ్ వంటి ప్రాంతాలకు రిఫర్ చేయాల్సి వస్తుందని వివరించారు. మెడికల్ కాలేజీ మంజూరు చేశారని, అది త్వరగా పూర్తయితే మల్టీ స్పెషాలిటీ సౌకర్యాలు అందుబాటులోకి తీసుకువస్తే జిల్లా ప్రజలకు ఎంతో ఉపయోగంగా ఉంటుందని, కావున చర్యలు తీసుకోవాలని కోరారు.

బొకేలు వద్దు : కలెక్టర్

ప్రజాశక్తి - పార్వతీపురంరూరల్

తనను కలవడానికి వచ్చే వారు బొకేలు తీసుకురావద్దని జిల్లా కలెక్టర్ ఎ.శ్యామ్ ప్రసాద్ విజ్ఞప్తి చేశారు. జిల్లా కలెక్టర్ కు మర్యాద పూర్వకంగా కలవడానికి పలువురు రావడం, బొకేలు తేవడం పట్ల ఆయన స్పందించారు. బొకేలు, ఏమీ తీసుకు రావద్దని, ఒకవేళ చేతులతో రావడానికి మొహమాట పడితే పోటీ పరీక్షలకు, గ్రంథాలయాలకు ఉపయోగపడే పుస్తకాలు మంచిదని అన్నారు. పుస్తకాలను జిల్లాలో ఏర్పాటు చేస్తున్న గ్రామ, పట్టణ విజ్ఞాన కేంద్రాలకు అందిస్తామని ఆయన చెప్పారు. పుస్తకం దీర్ఘకాలం జ్ఞాపకంగా నిలుస్తుందని ఆయన అన్నారు.

ఏకలవ్య పాఠశాలల్లో గిరిజనులనే నియమించాలి

ప్రజాశక్తి - కురుపాం

ఏకలవ్య పాఠశాలల్లో అర్హత కలిగిన గిరిజనులనే సిబ్బందిగా నియమించాలని గిరిజన సంఘం జిల్లా సహాయ కార్యదర్శి ఎం.శ్రీనివాసరావు ప్రభుత్వానికి డిమాండ్ చేశారు. శుక్రవారం కురుపాంలో గిరిజన సంఘం నాయకులు పి.తిరుపతిరావు, పి.మోహనరావుతో కలిసి విలేకరులతో మాట్లాడారు. ఏకలవ్య పాఠశాలల్లో గిరిజనులను నియమించాల్సి ఉండగా ఇద్దరో, ముగ్గురో గిరిజనేతరులను సిబ్బందిగా నియమించారని, దీనికి సాక్ష్యాత్తు గిరిజన సంక్షేమ శాఖ మంత్రి గుమ్మడి సంధ్యారాణి గిరిజనేతరులు ఒకరో ఇద్దరో కదా అనడం ఎంతవరకు సమంజసమని ప్రశ్నించారు. ఇప్పటికైనా ప్రభుత్వం స్పందించి ఏకలవ్య పాఠశాలల్లో కేవలం అర్హత కలిగిన గిరిజనులను మాత్రమే సిబ్బందిగా నియమించాలని డిమాండ్ చేశారు. లేనిపక్షంలో ఆందోళనలు చేపట్టాల్సి ఉంటుందని అన్నారు.

పాత విధానంలో వైద్య సౌకర్యాలు కల్పించాలి

ప్రజాశక్తి-పార్వతీపురంరూరల్

ఆర్టీసీ ఉద్యోగులకు పాత విధానంలోనే వైద్య సౌకర్యాలు కల్పించాలని ఎంప్లాయిస్ యూనియన్ డిప్యూటీ జనరల్ సెక్రటరీ పెంట భానుమూర్తి డిమాండ్ చేశారు. శుక్రవారం స్థానిక ఎన్జీవో హోంలో ఆ సంఘం జిల్లా కార్యవర్గ సమావేశం జిల్లా అధ్యక్షులు మరిది శ్రీనివాసరావు అధ్యక్షతన జరిగింది. ఈ సందర్భంగా భానుమూర్తి మాట్లాడుతూ 1/2019 సర్క్యులర్‌ను అమలు చేయకుండా అధికారులు పక్కనపెట్టి ఉద్యోగులపై క్రమశిక్షణ చర్యలు తీసుకుంటున్న విధానాన్ని మానుకోవాలన్నారు. కార్యక్రమంలో యూనియన్ జిల్లా కార్యదర్శి పి.సుందరరావు, వర్కింగ్ ప్రెసిడెంట్ దుర్గారావు, పలువురు నాయకులు పాల్గొన్నారు.



రోగులను పరీక్షిస్తున్న వైద్యాధికారి

రాముడుగూడలో వైద్య శిబిరం

ప్రజాశక్తి - కురుపాం

మండలంలో జి.శివడ పంచాయతీ రాముడుగూడలో మొండెంఖల్ ప్రాథమిక ఆరోగ్య కేంద్రం వైద్యాధికారి బి.ప్రజ్ఞ శుక్రవారం వైద్య శిబిరం ఏర్పాటు చేసి గ్రామంలో అందరికీ రక్త పరీక్షలు నిర్వహించి అవసరమైన వారికి మందులు పంపిణీ చేశారు. అనంతరం గ్రామస్తులతో ఆమె మాట్లాడుతూ వర్షాకాలం నేపథ్యంలో ప్రతి ఒక్కరూ కాచి చల్లార్చిన నీరు తాగాలని, తప్పనిసరిగా దోమతెరలు వాడాలని, వ్యక్తిగత పరిశుభ్రతతో పాటు పరిసరాలు శుభ్రంగా ఉంచుకొని ముందస్తు జాగ్రత్తలు తీసుకుంటేనే వ్యాధుల బారిన పడకుండా ఉండొచ్చని అన్నారు. కార్యక్రమంలో వైద్య సిబ్బంది సత్యారాజ్, భారతి, నాగేశ్వర్రావు, ఎఎన్‌ఎంలు అరుణ, సుబ్బాయి, హెల్త్ అసిస్టెంట్ జె.తిరుపతి రావు, దివాకర్, ఆనంద్, ఆశా వర్కర్లు పాల్గొన్నారు.

వరుస నాట్లతో అధిక దిగుబడులు

ప్రజాశక్తి - పాచిపెంట

వరి నాట్లను సాంప్రదాయ పద్ధతిలో కాకుండా వరుసల్లో నాటుకుంటే అధిక దిగుబడులు సాధించవచ్చునని మండల వ్యవసాయాధికారి కె.తిరుపతిరావు సూచించారు. మండలంలోని గురివినాయుడుపేటలో వరి నాట్లను పరిశీలించారు. వరుస నాట్లు వేయడం వల్ల గాలి, వెలుతురు బాగా సోకి తెగుళ్ల ఉధృతి తగ్గడమే కాకుండా అంతర కృషికి కూడా వీలుగా ఉంటుందని, ప్రతి ఐదు మీటర్ల తర్వాత 30 సెంటీమీటర్ల ఒక కాలిబాట విడిచి పెట్టాలన్నారు. వరి నాటేటప్పుడు తీసుకోవలసిన జాగ్రత్తలను రైతులకు వివరించారు. వ్యవసాయ శాఖ సూచనలు పాటిస్తూ రైతు తన అనుభవాన్ని జోడిస్తూ వ్యవసాయం చేసినట్లయితే ఖర్చును తగ్గించుకొని అధిక దిగుబడి సాధించవచ్చని తెలిపారు. కార్యక్రమంలో విఎఎ గణేష్, రైతులు పాల్గొన్నారు.

ఎఐబిలో పటిష్ట నిఘా

ప్రజాశక్తి - కొమరాడ

ఆంధ్రా -ఒడిస్సా సరిహద్దు ప్రాంతంలో గల పోలీస్ స్టేషన్ పరిధిలో కట్టుదిట్టమైన నిఘా వ్యవస్థను ఏర్పాటు చేస్తున్నట్టు ఎస్సై నీలకంఠం తెలిపారు. శుక్రవారం స్థానిక పోలీస్ స్టేషన్ పరిధిలో ఒడిశా నుంచి వస్తున్న ప్రతి వాహనాన్ని క్షుణ్ణంగా పరిశీలించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ఒడిశా నుంచి నిషేధిత వస్తువులైన గంజాయి, మద్యం నాటు సారా రవాణాపై ప్రత్యేక దృష్టిసారించామని తెలిపారు. ఒడిశా నుంచి ఆంధ్రాలోకి వచ్చే ప్రతి వాహనాన్ని పరిశీలించిన అనంతరం విడిచిపెడుతున్నట్టు తెలిపారు. గంజాయి, మద్యం తరలింపు ప్రజలకు సమాచారం తెలిస్తే పోలీసులకు తెలియజేయాలని సూచించారు.



బస్సుల్లో ప్రయాణికులను విచారిస్తున్న ఎస్‌ఐ

పలుచోట్ల పారిశుధ్య పక్షోత్సవాలు

ప్రజాశక్తి - పాలకొండ

పట్టణంలో పారిశుధ్య నిర్వహణకు ప్రత్యేక చర్యలు తీసుకుంటున్నట్లు నగర పంచాయతీ కమిషనర్ సర్వేశ్వరరావు అన్నారు. పారిశుధ్య పక్షోత్సవాల్లో భాగంగా శుక్రవారం పట్టణంలో పలు వీధుల్లో దగ్గరుండి పారిశుధ్య పనులు చేయించారు. వీధుల్లోని పెంట కుప్పలను తీయించారు. రోడ్లపై ఉన్న చెత్తా చెదారాన్ని కూడా తొలిగించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ పారిశుధ్య నిర్వాహణకు ప్రజలందరు సహకరించాలని కోరారు. రోడ్లపై చెత్త వేయవద్దని, చెత్త సేకరణ బళ్లకు అప్పగించాలని అన్నారు.


సీతంపేట: మండలంలో పారిశుధ్య పక్షోత్సవాల్లో భాగంగా ఇఒపిఆర్‌డి కొండపల్లి సత్యం ఆధ్వర్యంలో కెపి ఈతమానుగూడ గ్రామపంచాయతీ పరిధిలో ఫ్రైడే - డ్రైడే కార్యక్రమం నిర్వహించారు. కార్యక్రమం లో భాగంగా తాగు నీటి బావుల యందు క్లోరినేషన్, తడి ప్రదేశాల్లో బ్లీచింగ్ చల్లారు. ఎఎల్ఒ స్ప్రేయింగ్ పాఠశాలలో కిచెన్ గార్డెన్ గూర్చి ప్రధానోపాధ్యాయులు తెలిపారు. విద్యార్థులకు చేతులను శుభ్రం చేసుకునే విధానం అవగాహన కల్పించారు.

కొమరాడ : పారిశుధ్య పక్షోత్సవాల్లో భాగంగా కొమరాడ డ్రైడే ఫ్రైడే కార్యక్రమం ఎంపిడిఒ ఎంమల్లికార్జున ఆధ్వర్యాన నిర్వహించారు. ఈ సందర్భంగా గ్రామ పురవీధుల్లో పరిసరాలను పరిశుభ్రంగా ఉంచుకోవాలంటూ నినాదాలు చేసి ర్యాలీ చేపట్టారు. అనంతరం గ్రామ పురవీధుల్లో పర్యటించి ఎక్కడ మురికి నీరు నిల్వ లేకుండా చర్యలు చేపట్టారు. కార్యక్రమంలో ఇఒపిఆర్‌డి రాధాకృష్ణ, పంచాయతీ కార్యదర్శి, సచివాలయ, వైద్య సిబ్బంది పాల్గొన్నారు.

గుమ్మలక్ష్మీపురం : మండలంలోని తాడికొండ పంచాయితీ ఎగువ తాడికొండ, తోట గిరిజన గ్రామాల్లో పారిశుధ్య కార్యక్రమాలు నిర్వహించారు. ఈ సందర్భంగా గ్రామాల్లో ఉన్న వాటర్ ట్యాంకుల్లో క్లోరినేషన్ చేపట్టారు. మరోవైపు గ్రామాల్లో పిచ్చి మొక్కలను తొలగించి పరిసరాలను శుభ్రపర్చారు. వ్యాధుల పట్ల ప్రజలు అప్రమత్తంగా ఉండాలని, కాచిన వేడి నీటిని తాగాలని సూచించారు.



పాలకొండలో పారిశుధ్య పనులను పర్యవేక్షిస్తున్న కమిషనర్ సర్వేశ్వరరావు



సీతానగరం : గ్రామంలో ర్యాలీ చేస్తున్న వైద్య సిబ్బంది

కార్యక్రమంలో సర్పంచి మండంగి జగ్గారావు, పంచాయతీ కార్యదర్శి మల్లేశ్వరరావు, అంగన్వాడి, ఆశా వర్కర్లు ఉన్నారు.

పాచిపెంట : పారిశుధ్య వారోత్సవాల్లో భాగంగా మండలంలోని పి.కోనవలసలో డ్రైడే -ఫ్రైడే నిర్వహించారు. అనంతరం మండల ప్రత్యేకాధికారి శివప్రసాద్ పిండ్రంగివలస అంగన్వాడీ కేంద్రాన్ని సందర్శించి పిల్లలు, తల్లులకు అందుతున్న వైద్య సేవలను అడిగి, వారు తీసుకోవాల్సిన జాగ్రత్తలు గురించి వివరించారు. సీజనల్ వ్యాధుల పట్ల అప్రమత్తంగా ఉండాలని, ఇంటి పరిసరాలు పరిశుభ్రంగా ఉంచుకోవాలని సూచించారు. కార్యక్రమంలో ఐసిడిఎస్ సిడిపిఒ బి.అనంతలక్ష్మి, సూపర్వైజర్లు, అంగన్వాడీ కార్యకర్తలు, పంచాయతీ కార్యదర్శి పాల్గొన్నారు.

పార్వతీపురం రూరల్ : మండలంలోని బందులుప్పిలో పారిశుధ్య పక్షోత్సవాల్లో భాగంగా మండల ప్రత్యేక అధికారి ఎంవిఎన్ కృష్ణాజీ, ఎంపిడిఒ అకిబ్ జావేద్ గ్రామంలో జరుగుతున్న డ్రైడే కార్యక్రమాన్ని పరిశీలించి దోమలు నిలువ ఉండకుండా తీసుకోవాల్సిన చర్యలు గురించి ప్రజలకు అవగాహన కల్పించారు. అనంతరం అంగన్వాడీ కేంద్రాలను తనిఖీ చేసి సరుకు నిల్వలను సరిచూశారు. జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాల లో విద్యార్థులకు అందుతున్న సౌకర్యాలు మధ్యాహ్న భోజన పథకం పరిశీలించారు. కార్యక్రమంలో ఈవోపీఆర్డి జి.రమణమూర్తి, పంచాయతీ కార్యదర్శి భాస్కరరావు తదితరులు ఉన్నారు.

సీతానగరం: పారిశుధ్య పక్షోత్సవాల్లో భాగంగా మండలంలోని తామరకండి, కాజీపేట, దయానిధిపురం, గాజుల వలస, గుచ్చిమి, జోగింపేట, డగంద్రవలస, గెడ్డలుప్పి, ఆర్ వెంకంపేట, పెద్ద అంకలాం, చినబోగిలి, వెంకటాపురం, అంటిపేట, లచ్చయ్యపేట తదితర గ్రామాల్లో కాలువల్లో పూడుకలు తీశారు. మంచినీటి బావుల వద్ద దోమల నివారణకు స్ప్రేయింగ్ నిర్వహించినట్టు ఇఒపిఆర్‌డి కెకె వర్మ తెలిపారు. కార్యక్రమంలో ఆయా గ్రామాల పంచాయతీ కార్యదర్శులు, సచివాలయ, వైద్య సిబ్బంది, అంగన్వాడీ, ఆశా కార్యకర్తలు పాల్గొన్నారు.

ఏజెన్సీలో వైద్య సేవలు మెరుగుపర్చాలి

అసెంబ్లీలో గళం విప్పిన ఎమ్మెల్యే జగదీశ్వరి

ప్రజాశక్తి - గుమ్మలక్ష్మీపురం



కురుపాం నియోజకవర్గం లోని మన్యం ప్రాంతంలో గల సామాజిక, ప్రాథమిక ఆరోగ్య కేంద్రాల్లో సౌకర్యాలు మెరుగుపర్చి గిరిజనులకు మెరుగైన వైద్యం అందించే దిశగా ప్రభుత్వం చర్యలు చేపట్టాలని ఎమ్మెల్యే తోయక జగదీశ్వరి కోరారు. ఎమ్మెల్యేగా గెలుపొందిన తర్వాత తొలిసారిగా అసెంబ్లీ సమావేశాల్లో ఏజెన్సీ ప్రాంత సమస్యలపై శుక్రవారం ఆమె గళం విప్పారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే మాట్లాడుతూ ప్రతి ఏటా వర్షాకాలం వచ్చిందంటే చాలు మలేరియా, డయేరియా, డెంగీ తదితర వ్యాధులతో ఏజెన్సీ ప్రజలు ఇబ్బందులు పడుతున్నారన్నారు. వైద్యం కోసం ఆసుపత్రులకు వెళ్తున్నా సరైన సౌకర్యాల్లేవన్నారు. గిరిజన సంక్షేమ ఆశ్రమ పాఠశాలల్లో ఆరోగ్య కార్యకర్తలను నియమించాలని, స్థానికంగా వైద్య సేవలందించేలా చర్యలు తీసుకోవాలని కోరారు. ఆసుపత్రికి వివిధ రోగాలతో వందలాది సంఖ్యలో వస్తున్న రోగులకు బెడ్లు చాలక ఒకే మంచంపై ఇద్దరు, ముగ్గురు రోగులు పడుకోవాల్సి వస్తుందని అన్నారు. పాముకాటుకు మందుల్లేక గత ప్రభుత్వ హయాంలో ఇద్దరు విద్యార్థులు చనిపోయారని పేర్కొన్నారు. ప్రభుత్వం ఆసుపత్రుల్లో అన్ని రకాల మందులు అందుబాటులో ఉంచి గిరిజన రోగులకు, విద్యార్థులకు మెరుగైన వైద్య సేవలు అందించాలని స్పీకర్‌ను కోరారు.

29న చలో కలెక్టరేట్

ప్రజాశక్తి - కురుపాం

గరుగుబిల్లి మండలం శివ్వాం దళితులను తిట్టి, కొట్టిన పెత్తందారులను ఎస్సీ ,ఎస్టీ, అట్రాసిటీ చట్టప్రకారం అరెస్టు చేసి వారి భూ సమస్య పరిష్కరించాలని కోరుతూ ఈనెల 29న చలో కలెక్టరేట్ ధర్నాను జయప్రదం చేయాలని వ్యవసాయ కార్మిక సంఘం జిల్లా సహాయ కార్యదర్శి ఎం.శ్రీనివాసరావు పిలుపునిచ్చారు. కురుపాంలో చలో కలెక్టరేట్ గోడపత్రికలను విడుదల చేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ శివ్వాం దళితులకు ప్రభుత్వం 22.80 ఎకరాల భూమికి పట్టాలిచ్చిందని, వారు ఇంతవరకు సాగు చేసుకుంటుంటే ఇప్పుడు అదే గ్రామంలో కొంతమంది పెత్తందారులు దళితుల భూమిపై నారు పోయడానికి వెళ్లకుండా అడ్డుకొని దాడి చేయడం ఎంతవరకు సమంజసమని ప్రశ్నించారు. పెత్తందారులకు రెవెన్యూ అధికారులు కొమ్ము కాయడమే పనిగా ఉన్నారని, జిల్లా వ్యాప్తంగా ఇదే పరిస్థితి ఉందని కావున చలో కలెక్టరేట్ కార్యక్రమానికి దళితులు, గిరిజనులు పెద్ద సంఖ్యలో పాల్గొని జయప్రదం చేయాలని కోరారు. కార్యక్రమంలో గిరిజన సంఘం నాయకులు మోహనరావు, తిరుపతి, తదితరులు పాల్గొన్నారు.

రోడ్డు ప్రమాదాల నివారణకు కృషి

ప్రజాశక్తి - కొమరాడ

యువత రోడ్డు ప్రమాదాల నివారణకు కృషి చేస్తూ రోడ్డు భద్రత నియమాలను తప్పనిసరిగా పాటించాలని మన్యం జిల్లా రోడ్డు రవాణా అధికారి రమేష్ అన్నారు. శుక్రవారం స్థానిక ప్రభుత్వ జూనియర్ కళాశాలలో విద్యార్థులకు రోడ్డు ప్రమాదాల నివారణకు కృషి చేయాల్సిన అంశాలు రోడ్డు భద్రత నియమాలపై అవగాహన సదస్సు ఏర్పాటు చేశారు. ఈ సందర్భంగా రమేష్ మాట్లాడుతూ రోడ్డు ప్రమాదాలపై అవగాహన కల్పించుకొని ప్రభుత్వ నిబంధనలను ప్రతి ఒక్కరూ తప్పకుండా పాటించాలన్నారు. ముఖ్యంగా మైనర్లు వాహనాలు నడిపితే ప్రమాదాలు జరిగే అవకాశం ఉన్నందున లైసెన్స్ లేకుండా వాహనాలు నడపకూడదని సూచించారు. మైనర్లు వాహనాలు నడిపితే చర్యలు తీసుకుంటామని హెచ్చరించారు. పరిమితికి మించి ఆటోల్లో, ప్రైవేట్ వాహనాలను ఎక్కిస్తే చర్యలు తప్పవన్నారు. ప్రమాదాలు జరిగే సమయంలో తీసుకోవాల్సిన జాగ్రత్తలు, ప్రమాదం నుంచి తప్పించుకునేందుకు అవకాశం ఉన్నచోట ఎలా తప్పించుకోవాలన్న



విద్యార్థులకు రోడ్డు ప్రమాదాలపై అవగాహన కల్పిస్తున్న ఆర్‌టిఒ రమేష్

అంశాలపై వివరించారు. కార్యక్రమంలో వైద్యాధికారి, కళాశాల ప్రిన్సిపల్ నాగేశ్వరరావు కళాశాల సిబ్బంది విద్యార్థులు పాల్గొన్నారు.

అవగాహనతో వ్యాధులు దూరం

ప్రజాశక్తి -పార్వతీపురం రూరల్

అవగాహనతోనే వ్యాధులు దరి చేరకుండా జాగ్రత్త పడొచ్చని హెల్త్ ప్రోగ్రాం అధికారి డాక్టర్ టి.జగన్మోహన్ రావు సూచించారు. స్థానిక ప్రభుత్వ జూనియర్ కళాశాలలో ప్రిన్సిపల్ ఆధ్వర్యంలో విద్యార్థులకు నిర్వహించిన ఆరోగ్య అవగాహన కార్యక్రమంలో ఆయన మాట్లాడారు. విద్యార్థులు పలు ఆరోగ్య అంశాలైన సీజనల్ వ్యాధులు, రక్త హీనత, పరిసరాల, వ్యక్తిగత పరిశుభ్రత, పౌష్టికాహారం, రోగ నిరోధకశక్తి మొదలగు వాటిపై అవగాహన, పరిజ్ఞానం ఉండాలన్నారు. తద్వారా వ్యాధులకు గురి కాకుండా జాగ్రత్త పడొచ్చని తెలిపారు. మలేరియా, డెంగీ తదితర సీజనల్ జ్వరాలకు దోమలు ప్రధాన కారణమని, ఇంటి పరిసరాల్లో నీరు నిల్వలేకుండా చూసుకోవడం, పరిసరాలను పరిశుభ్రంగా ఉంచడం ద్వారా దోమలను నివారించవచ్చని అన్నారు. అందుబాటులో ఉన్న ఉచిత వైద్య సేవలు గురించి వివరించారు. ముఖ్యంగ్ కిశోర బాలికలు రక్త హీనతకు గురికాకుండా ఐరన్ మాత్రలు వేసుకోవాలని, సమతుల ఆహారం తీసుకోవాలని సూచించారు. చేతుల పరిశుభ్రత ప్రాధాన్యత వివరించారు. కార్యక్రమంలో ప్రిన్సిపల్ జి.రామారావు, వైద్య సిబ్బంది సత్తిబాబు, నారాయణమ్మ, కళాశాల అధ్యాపకులు తదితరులు పాల్గొన్నారు.

మాజీ సైనికుల సంక్షేమానికి కృషి

ప్రజాశక్తి - పార్వతీపురంటౌన్

మాజీ సైనికుల సంక్షేమానికి కృషి చేస్తానని జిల్లా కలెక్టర్ ఎ.శ్యామ్ ప్రసాద్ అన్నారు. కలెక్టరేట్‌లో శుక్రవారం జిల్లా మాజీ సైనికులు సంక్షేమ సంఘం ఆధ్వర్యంలో జిల్లా కలెక్టర్ కు దుశ్శాలువాతో సన్మానించి పుష్పగుచ్ఛాలు అందజేశారు. సైనికుల అనుభవాలను అడిగి తెలుసుకున్నారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ దేశ రక్షణకు ప్రాణాలొడ్డి అమరులైన సైనికుల త్యాగాన్ని వెలకట్టలేమన్నారు. మాజీ సైనికులకు ప్రభుత్వం కల్పించిన సౌకర్యాలు మేరకు అమలుచేసేందుకు తనవంతు కషి చేస్తానని స్పష్టం చేశారు. కార్యక్రమంలో సంఘం గౌరవ అధ్యక్షులు టి చంద్రశేఖర రావు, మాజీ సైనికుల సంఘం అధ్యక్షులు కైలాష్ రావు, సభ్యులు జైరామ్, భాస్కరరావు, రామకష్ణ, కోరాడ నారాయణరావు, తదితరులు, పాల్గొన్నారు.

పారిశుధ్య పనుల తనిఖీ

ప్రజాశక్తి - జియ్యమ్మవలస

మండలంలో ప్రస్తుత వర్షాల ప్రభావంతో గ్రామాల్లోని పారిశుధ్య పనులపై ఎంపిడిఒ పి.శ్రీ నివాసరావు ప్రత్యేక సారించారు. డ్రై డే ఫ్రైడే సందర్భంగా శుక్రవారం వనజలో జరుగుతున్న పారిశుధ్య కార్యక్రమంలో పాల్గొన్నారు. అనంతరం జిటిడబ్ల్యుఎ ఉన్నత పాఠశాలను సందర్శించి పాఠశాల పరిసరాలను, తరగతి గదులను పరిశీలించారు. ఈ సందర్భంగా ఆయన విలేకరులతో మాట్లాడుతూ స్కూల్లో విద్యాబోధన, భోజన ఇతర వసతి సౌకర్యాలు సక్రమంగా ఉన్నాయని, స్కూల్లో 92 మంది విద్యార్థులు ఉండగా శుక్రవారం 86 మంది హాజరయ్యారని తెలిపారు. విద్యా ప్రమాణాలు బాగున్నప్పటికీ బోధనేతర సిబ్బంది కొరత ఉండడంపై ఉన్నతాధికారులకు తెలియజేస్తామన్నారు. కార్యక్రమంలో భాగంగా జియ్యమ్మవలస ప్రాథమిక ఆరోగ్య కేంద్రం వైద్య సిబ్బంది విద్యార్థులకు వైద్య పరీక్షలు నిర్వహించారు. కార్యక్రమంలో అర్నాడ సచివాలయం సిబ్బంది, జియ్యమ్మవలస పిహెచ్‌సి సిబ్బంది పాల్గొన్నారు.

రక్తనిధి కేంద్రం ఏర్పాటు చేయాలి

ప్రజాశక్తి - సాలూరు

స్థానిక ఏరియా ఆసుపత్రి లో రక్తనిధి కేంద్రం ఏర్పాటు చేయాలని కోరుతూ మీకై మేము స్వచ్ఛంద సంస్థ అధ్యక్షులు ఇప్పిలి దిలీప్ కుమార్ శుక్రవారం జిల్లా కలెక్టర్ ని కోరారు.ఏజెన్సీ మండలాల్లో గిరిజనులు ఎక్కువగా రక్తహీనతతో బాధపడుతున్నారని చెప్పారు.స్వచ్ఛంద సంస్థల సహకారంతో రక్తదాన శిబిరాలు నిర్వహించాలని యోచిస్తున్నట్లు జిల్లా కలెక్టర్ శ్యాం ప్రసాద్ చెప్పారని దిలీప్ కుమార్ తెలిపారు.

విద్యార్థుల పొలం సందర్శన

ప్రజాశక్తి - పాలకొండ

మండలంలోని ఓని గ్రామ ప్రాథమికోన్నత పాఠశాలలో "శిక్ష సప్తహ" ఐదో రోజు కార్యక్రమంలో భాగంగా పాఠశాల విద్యార్థులను దగ్గర్లో ఉన్న వ్యవసాయ పొలాలను సందర్శనకు తీసుకెళ్లారు. గ్రామ రైతు కనపాక వెంకటరావు వ్యవసాయ క్షేత్రంలో ఉన్న పత్తి, వరి, బెండ, చిక్కుడు పంటల సాగు విధానం గూర్చి అవగాహన కల్పించారు. కార్యక్రమంలో పాఠశాల ఉపాధ్యాయులు గోగుల సూర్యనారాయణ, పాలవలస శారదా కుమారి, దానేటి పుష్పలత, సిద్దాబత్తుల వెంకటరమణ పాల్గొన్నారు.

ప్రకృతి వ్యవసాయంపై శిక్షణ

ప్రజాశక్తి - భామిని

భూసార పరీక్షల ద్వారా రైతు తన భూమి ఏ పంటలకు అనుకూలమో, ఎలా సాగుబడి చేయాలో వంటి అంశాలు తెలుసుకోవాలని జిల్లా వనరులు కేంద్రం వ్యవసాయ అదనపు సంచాలకులు ఆర్. శ్రీనివాస్ అన్నారు. భామినిలోని రైతు భరోసా కేంద్రంలో వాతావరణ మార్పులకు అనుగుణంగా రైతులు సాగు చేయాల్సిన పంటలు, ప్రకృతి వ్యవసాయం, భూసార పరీక్షల ఫలితాల ఆధారంగా ఎరువులు వేయడంపై శిక్షణా కార్యక్రమం శుక్రవారం నిర్వహించారు ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ తక్కువ వర్షాలు కురుస్తున్నందున రైతులు ప్రత్యామ్నాయ ఆరు తడి పంటలైన కందులు, రాగులు ,మొక్కజొన్న వంటి వాణిజ్య పంటలపై దృష్టి పెట్టాలన్నారు. అలాగే రాగులు, సజ్జలు, కొర్రలు వంటి పంటలపై కూడా దృష్టి పెట్టినట్టయితే తక్కువ వర్షపాతం ఉన్నప్పటికీ రైతులు ఆర్థికంగా అభివృద్ధి చెందవచ్చు అని తెలిపారు. భూసార పరీక్షల ఫలితాలు అనుగుణంగా రైతులు ఎరువులు వేసుకున్నట్లయితే నాణ్యమైన దిగుబడులు పొందడమే కాకుండా సాగు ఖర్చులు తగ్గించుకోవచ్చు అని తెలిపారు. వ్యవసాయ సహాయ సంచాలకులు రత్న కుమారి ప్రకృతి వ్యవసాయం సాగుపై వివరించారు. కార్యక్రమంలో ఎఒ కె. సింహాచలం, విఎఎలు ఎర్రన్న, దుర్గాప్రసాద్, ఎలీషా, భవాని, నాగరాజు, రైతులు లక్ష్మీపతి నాయుడు, రామారావు, అనంతరావు తదితరులు పాల్గొన్నారు.

విద్యార్థులకు వైద్యపరీక్షలు

ప్రజాశక్తి - పాలకొండ

పట్టణ ఆరోగ్య కేంద్రం ఆధ్వర్యాన స్థానిక ప్రభుత్వ జూనియర్ కళాశాల (బాలురు)లో సుమారు 300 మంది విద్యార్థిని, విద్యార్థులకు వైద్య పరీక్షలు నిర్వహించారు. వర్షాకాలం కారణంగా ఎటువంటి వ్యాధులు సంక్రమించకుండా ముందస్తు జాగ్రత్త చేపడుతున్నారు. ఇందులో భాగంగా వైద్య సిబ్బంది మలేరియా తదితర రక్త పరీక్షలు నిర్వహించారు. వీరిలో ఒక్క విద్యార్థికి మలేరియా పాజిటివ్ ఉన్నట్టుగా నిర్ధారించి ఆ విద్యార్థికి అవసరమైన మందులు సరఫరా చేశారు. కార్యక్రమం కాలేజీ ప్రిన్సిపల్ వి.హరగోపాల్ పర్యవేక్షణలో ఎన్.ఎస్.ఎస్ విభాగ ఆధ్వర్యంలో ఈ పరీక్షలు నిర్వహించారు. పట్టణ ఆరోగ్య కేంద్ర సిబ్బంది బివి రమణ, జాడ శివప్రసాద్, విశ్వనాథం, శంకరరావు, ఆశా కార్యకర్తలు పాల్గొన్నారు.

కెజిబివిని సందర్శించిన సర్పంచ్

ప్రజాశక్తి - గుమ్మలక్ష్మీపురం

స్థానిక కస్తూర్బా గాంధీ బాలికల పాఠశాలను సర్పంచ్ బొత్తాడ గౌరీశంకరరావు శుక్రవారం సందర్శించారు. ఈ సందర్భంగా విద్యార్థుల హాజరు శాతం, పరిసరాల పరిశుభ్రత, సౌకర్యాలు, అందిస్తున్న భోజనం వంటివి పరిశీలించి విద్యార్థులతో మాట్లాడారు.

రోడ్ల మెరుగుకు చర్యలు

ప్రజాశక్తి - గుమ్మలక్ష్మీపురం

మండలంలోని ఎల్విన్‌పేటలో స్టేట్ బ్యాంకు వీధి, గ్రామ సచివాలయం, ఎస్టీ కాలనీ వీధుల్లో పాడైన రహదారుల వద్ద సిసి రోడ్ల నిర్మాణ పనులు చేపడుతున్నట్లు పంచాయతీరాజ్ ఎఇ మురళి తెలిపారు. వర్షాకాలం దృష్ట్యా ఎక్కువగా పాడై నీరు నిల్వ ఉన్నచోట రోడ్లను గుర్తించి సిసి రోడ్లు బిట్లుగా వేస్తున్నామని చెప్పారు. నాలుగు బిట్లకు సంబంధించి రూ.3లక్షలతో పనులు జరుగుతున్నాయన్నారు.



ఎల్విన్‌పేటలో రోడ్డు పనులు చేయిస్తున్న ఎఇ



పోస్టర్‌ను ఆవిష్కరిస్తున్న కలెక్టర్, ట్రాన్స్‌కో ఎస్ఇ, అధికారులు

సోలార్ రూఫ్ టాప్‌తో తక్కువ విద్యుత్ ఛార్జీలు

ప్రజాశక్తి-పార్వతీపురంరూరల్

ప్రధానమంత్రి సూర్య ఘర్ యోజన పథకం కింద రాయితీతో ఇంటిపై సోలార్ రూఫ్ టాప్ నిర్మించుకుని విద్యుత్ బిల్లు తగ్గించుకోవచ్చని జిల్లా కలెక్టర్ ఎ. శ్యామ్ ప్రసాద్ పేర్కొన్నారు. శుక్రవారం కలెక్టర్ కార్యాలయంలో ప్రధానమంత్రి సూర్యఘర్ యోజన పథకం గోడపత్రికను ఆయన ఆవిష్కరించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ రాయితీపై అందిస్తున్న ప్రధానమంత్రి సూర్య ఘర్ యోజన పథకం గృహ వినియోగదారులకు విద్యుత్ ఛార్జీల భారం తగ్గించుకునేందుకు చక్కని అవకాశం అన్నారు. రాయితీని పొంది ఇంటిపై సోలార్ రూఫ్ టాప్ నిర్మించుకోవచ్చు అన్నారు. కనీసం 10 చదరపు మీటర్లు లేక 100 చదరపు అడుగుల స్థలంలో ఒక కిలోవాట్ సామర్థ్యం కలిగిన సోలార్ రూఫ్ టాప్ ఏర్పాటు చేసుకోవచ్చన్నారు. ఈ పథకం వల్ల గృహ వినియోగదారులకు అతి తక్కువ విద్యుత్ బిల్లు వస్తుందన్నారు. ఒక కిలోవాటు సోలార్ రూఫ్ టాప్ ఏర్పాటు సామర్థ్యానికి ఉత్పత్తి అయ్యే యూనిట్లు 120, వినియోగదారునికి వస్తున్న ప్రస్తుత బిల్లు రూ.1000, సోలార్ ఏర్పాటు తర్వాత వచ్చే బిల్లు రూ.300, ఏడాదికి ఆదా రూ.8వేలు, ప్రభుత్వ రాయితీ 30వేలు ఉంటుందని తెలిపారు. కార్యక్రమంలో ఎపిఇపిడిసిఎల్ ఎస్ఇ ఎం.లక్ష్మణరావు, ఇఇ వివి కిషోర్, డిప్యూటీ ఎగ్జిక్యూటివ్ ఇంజనీర్ ఎం. రాజేంద్రప్రసాద్, తదితరులు, పాల్గొన్నారు.

పాఠశాల పరిశీలన

ప్రజాశక్తి - సీతానగరం

మండలంలోని జోగింపేట స్కూల్ ఆఫ్ ఎక్స్ గురుకుల పాఠశాలను మండల ప్రత్యేక అధికారి కె.రామచంద్రరావు శుక్రవారం పరిశీలించారు. సందర్భంగా ఆయన గ్రామాల్లో నిర్వహిస్తున్న పారిశుధ్య పనులు గురించి అడిగి తెలుసుకున్నారు. హాస్టల్ విద్యార్థుల వసతులు భోజన సదుపాయాల గురించి అడిగి తెలుసుకున్నారు. అలాగే సీజనల్ వ్యాధుల పట్ల అప్రమత్తంగా ఉండాలని చెప్పారు. కార్యక్రమంలో ఎంపిడిఒ కె.ఈశ్వరరావు, ఇఒపిఆర్‌డి కెకె కుమారవర్మ, ఎంఇఒ జి.సూర్య దేముడు, పంచాయతీ కార్యదర్శులు ధనలక్ష్మి, పైడ్రాజు పలువురు పాల్గొన్నారు.

సొంతంగా విత్తనాలు తయారు చేసుకోవాలి

ప్రజాశక్తి - వీరఘట్టం

రైతులే సొంతంగా విత్తనాలు తయారు చేసుకోవాలని టిటిసి ఎడిఎ ఆర్.శ్రీనివాస్ రైతులకు సూచించారు. శుక్రవారం మండలంలోని విక్రంపురంలో రైతులతో ఏర్పాటు చేసిన గ్రామీణ విత్తన అభివృద్ధి కార్యక్రమంలో మాట్లాడారు. సొంతంగా విత్తనాలు తయారు చేసి మెలకువలు నేర్చుకోవాలన్నారు. చిట్టిపూడి వలస రైతు భరోసా కేంద్రం పరిధిలో 25 ఎకరాల్లో ఎంటియు 1064 ఫౌండేషన్ సీడ్ ఇచ్చామన్నారు. కిమ్మిలో ప్రకృతి వ్యవసాయ పద్ధతులు గూర్చి రైతులకు వివరించారు. ఘన ,ద్రవ జీవమూత్రాల తయారు చేసే పద్ధతులు వివరించారు. కార్యక్రమంలో డిఆర్‌సి ఎడిఎలు శారద, భారతి స్థానిక వ్యవసాయ అధికారి జె.సౌజన్య ,రైతులు పాల్గొన్నారు.

భామిని: మండలంలోని గురండిలో శటిటిసి ఎడిఎ ఆర్ శ్రీనివాస్, పాలకొండ ఎడిఎ రత్నకుమారి, మండల వ్యవసాయ అధికారి కె. సింహాచలం రైతులకు గ్రామీణ విత్తన ఉత్పత్తి పథకంలో భాగంగా శిక్షణ కార్యక్రమం నిర్వహించారు. ఈ సందర్భంగా క్షేత్రాన్ని పరిశీలించి వరి నాట్లులో లోపాలను గమనించి రైతులకు సరైన యాజమాన్య పద్ధతులపై అవగాహన కల్పించారు. నాట్లు వేసిన మూడు రోజుల్లోపు కలుపు నివారణలో భాగంగా



శిక్షణలో మాట్లాడుతున్న ఎడిఎ శ్రీనివాస్

80 గ్రాములు పైరాజోసల్ఫురాన్, ప్రిటీలాక్లోర్ 400 మిల్లీమీటర్లు, 20 కేజీల పొడి ఇసుకలో కలిపి ఎకరా పొలంలో చల్లుకోవాలని ఎఒ సింహాచలం తెలిపారు. కార్యక్రమంలో వ్యవసాయ సహాయకులు ఈశ్వర్, దినేష్, నిఖిల్ మహేంద్ర, రైతులు సతీష్, శంకర్రావు, జగదీష్, నూకరాజు పాల్గొన్నారు.